సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



మైండ్‌లో ఫిక్స్ అయితే..
అభ్యర్థులు తమకు కలిసొచ్చిన చోట నుంచి ప్రచారం ప్రారంభించడం, నామినేషన్లు వేయడం ఆనవాయితీగా మారింది. - 10లో



బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం..
బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. - 11లో



క్రీడల్లో ప్రోత్సహించాలి
విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి నారాయణరెడ్డి అన్నారు. - 11లో

న్యూస్‌రీల్

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



పంతంగి చెక్‌పోస్టు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న నల్లగొండ కలెక్టర్

చౌటుప్పల్ : చెక్ పోస్టుల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులకు సూచించారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50వేలకు మించి తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాల్లో తరలించే వస్తువులపైనా నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ జగన్నాథరావు, పోలీసు అధికారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జి.శ్రీజ

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థిని జి.శ్రీజ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 14న సూర్యాపేటలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచడంతో ఆమెను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 19నుంచి 21వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. శ్రీజను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు సిల్వేరు మహేష్ తదితరులు అభినందించారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పరిపూర్ణాచారి

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. రోగులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సకాలంలో విధులకు హాజరై రోగులకు 24 గంటలు సేవలు అందజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మోసెస్ రాజు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి



మాట్లాడుతున్న ఏడీఏ పద్మావతి

తుర్కపల్లి : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఆలేరు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు (ఏడీఏ) పద్మావతి అన్నారు.డెక్కన్ డెవలప్‌మెంట్ సంస్థ (డీడీఎస్) వారి జీవ వైవిధ్య పండుగల్లో భాగంగా పిలుపు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తుర్కపల్లిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగుల వల్ల అధిక లాభాలు గడించవచ్చన్నారు. ఉరుకులపరుగుల జీవితంలో ఎంతో మంది బీపీ, షుగర్ వంటి రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటున్నారని తెలిపారు. చిరుధాన్యాలను సాగు చేసి ఎంతో మంది మహిళలు ఆర్థికంగా స్థిరపడ్డారని, మరింత పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలోడీడీఎస్ అధికార ప్రతినిధి క్రిష్ణవేణి, ఏఈఓ జెస్సీకా, పిలుపు స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, స్వర భారతి మాక్స్ మేనేజర్ మంగమ్మ, కరుణాకర్, సుమలత, మంగమ్మ పాల్గొన్నారు.

భువనగిరికి ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్కు

స్థానికంగానే ఉద్యోగాలు

- వరాలు ప్రకటించిన సీఎం
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే భువనగిరి అభివృద్ధి
- ఇక్కడి భూములకు ధరలు పెరిగాయ్
- ఒకప్పుడు కరువు ఛాయలు.. ఇప్పుడు పచ్చని పంటలు
- అరాచక శక్తుల ఆటకట్టించామని కేసీఆర్ వెల్లడి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపు
- ప్రజా ఆశీర్వాద సభ విజయవంతంతో కేడర్‌లో ఉత్సాహం





భువనగిరిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తుండగా బీఆర్‌ఎస్ కండువాలు ఊపుతూ కేరింతలు కొడుతున్న యువకులు, మహిళలు



సభలో ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి,యాదాద్రి : భువనగిరి నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నందున ఇక్కడ ఐటీ హబ్ ఏర్పాటు చేసి ఐటీ పరిశ్రమలు కచ్చితంగా తీసుకు రావాలని మంత్రి కేటీఆర్‌కు చెప్పానని సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నికల తర్వాత భువనగిరికి స్పెషల్ ఐటీ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్ కూడా పెట్టించే బాధ్యత నాది అని సీఎం హామీ ఇచ్చారు. ఐటీపార్కు వల్ల బ్రహ్మాండంగా మన పిల్లలకు ఉద్యోగాలు దొరికే ఆస్కారం ఉంటుందన్నారు. భువనగిరిలో సోమవారం సాయంత్రం ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. నాకున్న సర్వేల రిపోర్టు ప్రకారం 50 వేల ఓట్ల మెజార్టీతో పైళ్ల శేఖర్‌రెడ్డి గెలవబోతున్నాడని కేసీఆర్ చెప్పారు. 98 శాతం పూర్తయిన బస్వాపూర్ రిజర్వాయర్‌ను(నృసింహసాగర్) ప్రారంభించుకుని లక్ష ఎకరాలకు సాగునీరును అందిస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ శేఖర్‌రెడ్డిని గెలిపిస్తారు కాబట్టి నియోజకవర్గం బంగారు తున్కలా మారుతుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం భువనగిరిలో అరాచక శక్తులను పెంచిపోషించిందని, ప్రజలను గోసకు గురిచేసిన అలాంటి అరాచక, కిరాతక మూకలను అరికట్టి భువనగిరి ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చేశామని కేసీఆర్ గుర్తుచేశారు.

అద్భుతంగా యాదాద్రి దేవాలయం

యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని అద్భుతంగా చేసుకున్నాం.. ఈ జిల్లాకు లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులతో యాదాద్రి భువనగిరి జిల్లా అని భగవంతుని పేరు పెట్టుకున్నామని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకుంటే భువనగిరి జిల్లానే కాకపోతుండె అని అన్నారు. తెలంగాణ వచ్చాక ఇవ్వాల భూముల ధరలు ఎట్లా ఉన్నయో మీ అందరికీ తెలుసునని, యాదగిరిగుట్ట దగ్గర పొద్దున ఒకరేటు, మధ్యాహ్నం ఒకరేటు, సాయంత్రం ఒక రేటులో ఇవ్వాల కోట్ల రూపాయల్లో ఉందన్నారు. భూమిలేని నిరుపేదలకు కూడా న్యాయం జరగాలని బీమా, సన్నబియ్యం, సౌభాగ్యలక్ష్మి, గృహలక్ష్మి పథకాలను ప్రకటించామని, మీ ఆశీస్సులతో మళ్లీ గెలిపిస్తే మీసేవలో అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. పైళ్ల శేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

అద్భుతంగా పంటలు

ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉన్న భువనగిరిలో ఈరోజు చాలా అద్భుతమైన పంటలు పండుతున్నాయని కేసీఆర్ అన్నారు. గతంలో గోదావరి జలాలు, ఇక్కడున్న రెండు మూడు కాలువలు ఈ ప్రాంతానికి రావాలని మనం ఎన్నో పోరాటాలు చేశామని, ఎన్నో కలలు కన్నామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కాలువల పనులు జరుగుతున్నయ్, త్వరలో పూర్తవుతాయని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, చిరుమర్తి లింగయ్య, బడుగుల లింగయ్యయాదవ్, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జడల అమరేందర్, కొలుపుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎనబోయిన అంజనేయులు, చింతల కిష్టయ్య, మార్కెట్ చైర్మన్లు ఎడ్ల రాజేందర్‌రెడ్డి, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, గాదె నరేందర్‌రెడ్డి, దాసోజు శంకరమ్మ, సిద్దుల పద్మ, శెట్టిబాలయ్య యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష్య కార్యదర్శులు కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి బీబీనగర్, పోచంపల్లి ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి సభకు వస్తున్న భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు



స్టేజీపై పాటలు పాడుతున్న మధుప్రియ

సీఎం తొలిసభ సక్సెస్

ఈ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో సీఎం కేసీఆర్ భువనగిరిలో నిర్వహించిన తొలి ఎన్నికల సభ సక్సెస్ అయ్యింది. ప్రజా ఆశీర్వాద సభ ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభకు పెద్ద ఎత్తున మహిళలు, యువకులు తరలివచ్చారు. సీఎం కేసీఆర్ సభా వేదికపైకి వచ్చే సరికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం జనంతో నిండిపోయింది. కేసీఆర్ సుమారు 12 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. సమయాభావం వల్ల త్వరగా వెళ్తున్నానని, అధికారంలోకి రాగానే మరోసారి వస్తానని చెప్పారు. సీఎం సభలో ప్రసగింస్తున్న సమయంలో కూడా ప్రజలు పెద్ద ఎత్తున వస్తూనే ఉన్నారు. మైదానంలో స్థలం లేకపోవడం వల్ల రోడ్లపైన బస్టాండ్ ఆవరణలో నిలబడి సీఎం ప్రసంగం విన్నారు.



భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని సభలో ప్రజలను కోరుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఐటీ హబ్‌పై 'సాక్షి' కథనం

'మాకు ఐటీ కావాలి' శీర్షికతో ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై సీఎం కేసీఆర్ స్పందించారు. భువనగిరిలో భారీ ఐటీ హబ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం నోట ఐటీ హబ్ ప్రస్తావన రావడంతో యువత పెద్ద ఎత్తున కేరింతలుకొట్టారు. ఐటీ హబ్ ప్రకటించిన సీఎంకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



మాకూ 'ఐటీ' కావాలి

సీఎం ఆశీర్వాదంతో అభివృద్ధి

–భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సీఎం కేసీఆర్ సహకారంతో భువనగిరి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి చేశానని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకోవడానికి తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ విధానాల వల్ల చెరువుల్లో నీరు నిల్వ ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డును అభివృద్ధి చేసుకోవడంతో పాటు భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా సుందరీకరణ చేశామన్నారు. భువనగిరికి ఐటీ హబ్ మంజూరు చేయాలని, మెట్రో రైలును భువనగిరి వరకు పొడిగించాలని సీఎంను కోరారు. నృసింహ సాగర్(బస్వాపురం) నిర్మాణ క్రమంలో భూమి కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని భువనగిరి, భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు.

వేతన కష్టాలు..!

- వివిధ శాఖల్లో సర్దుబాటైన వీఆర్‌ఏలకు వేతనాల చెల్లింపులో జాప్యం
- రెండున్నర నెలలుగా ఎదురుచూపులు
- ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన



ఇటీవల కలెక్టర్‌ను కలవడానికి కలెక్టరేట్‌కు వచ్చిన సర్దుబాటైన వీఆర్‌ఏలు

ఆత్మకూరు(ఎం) : వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటైన వీఆర్‌ఏలు బతుకమ్మ, దసరా పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరికి వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. రెండున్నర నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా అద్దెకు ఉంటున్న ఇతర జిల్లా ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

జిల్లాలో 500 మంది సర్దుబాటు

యాదాద్రిలో భువనగిరి జిల్లాలో సుమారు 618 వీఆర్‌ఏలు ఉండగా వీరిలో 500 మందిని తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డు అసిస్టెంట్‌లు, అటెండర్‌లు, చైన్‌మన్‌లుగా ప్రభుత్వం సర్దుబాటు చేసింది. వీరిని జీఓ 85 ద్వారా 2023 ఆగస్టు 3వ తేదీన ఆయా పోస్టుల్లో నియమించింది. మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా కొందరిని యాదాద్రి భువనగిరికి కేటాయించింది. వీరంతా స్థానికంగా ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. వెంట తెచ్చుకున్న డబ్బుతో రెండు నెలల నుంచి అద్దె చెల్లిస్తూ కుటుంబాలను వెళ్లదీసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వేతనాలు రాకపోవడం, మరోవైపు తెచ్చుకున్న డబ్బులు కూడా అయిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలెక్టర్ కార్యాలయంలో వినతి

వేతనాలు చెల్లించాలని సర్దుబాటైన వీఆర్‌ఏలు ఇటీవల కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదు.

తెచ్చుకున్న డబ్బులు అయిపోయాయి



మెదక్ జిల్లా నుంచి వచ్చాను. అక్కడ కొలిచారు గ్రామ వీఆర్‌ఏగా పని చేశాను. ప్రస్తుతం పదోన్నతిపై ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకొంటున్నాం. తెచ్చుకున్న డబ్బులు కూడా అయిపోయాయి.

–సీహెచ్.అనిత, రికార్డ్ అసిస్టెంట్

చేతిలో చిల్లిగవ్వ లేదు



ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నా. అంతకుముందు ఆలేరు మండలంలోని గొలనుకొండ వీఆర్‌ఏగా పని చేశాను. పదోన్నతిపై ఆత్మకూర్(ఎం)కు వచ్చాను. రెండు నెలలుగా వేతనాలు వస్తలేవు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

–మధుసూదన్, అటెండర్

అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్నాం



మాది వేరే జిల్లా. పదోన్నతిపై ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. రెండు నెలల నుంచి వేతనాలు లేవు. ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దసరా పండుగ ఉంది. చేతిలో పైసా లేదు. ప్రభుత్వం కరుణించి వెంటనే వేతనాలు చెల్లించాలి.

–సాయిలు, రికార్డ్ అసిస్టెంట్

ఉప ఎన్నికలో గెలిస్తే ప్రభుత్వం కుప్పకూలేది

- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్‌లోని నూతన క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ గెలిస్తే మరుక్షణమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుప్పకూలేదని, లిక్కర్ కుంభకోణంలో కవిత జైలుకు వెళ్లేదని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ ఆ పరిస్థితిని గ్రహించే దుర్మార్గాలు, అరాచకాలు సృష్టించి అనైతిక విజయం సాధించారని ధ్వజమెత్తారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో సోమవారం బీజేపీ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఓడించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా మునుగోడులోనే మకాం వేసిందన్నారు. బీజేపీకి ఓట్లు వేయకుండా ప్రజలపై అక్రమ కేసులు పెట్టడం, బెదిరించడం, దాడులు చేయడం వంటి ఘటనలకు పాల్పడ్డారని ఆరోపించారు. పార్టీలోనూ కొంత సమన్వయం లోపించిందని, నాటి పరిస్థితులను బేరీజు వేసుకొని పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని నాయకులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో తనపై వచ్చిన రకరకాల ఊహాగానాలు, తప్పుడు కథనాలు క్షోభకు గురిచేశాయమన్నారు. ఉప ఎన్నికలో తనకు 87 వేల ఓట్లు వేసి ఆదరించిన మునుగోడు ప్రజలకు అండగా ఉండాలని నిర్ణయించుకొని ఇక్కడికి వచ్చానన్నారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ప్రధానమంత్రి మోదీ సారథ్యం అవసరమన్నారు. తనకు ఎమ్మెల్యే పదవి కంటే అరాచక, అవినీతి, కుటుంబ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యమన్నారు. ప్రతి కార్యకర్త తనే అభ్యర్థిగా, రాజగోపాల్‌రెడ్డిగా భావించుకొని ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రిక్కల సుధాకర్‌రెడ్డి, ఊడుగు వెంకటేష్, సర్పంచ్‌లు బాతరాజు సత్యం, కాయితి రమేష్‌గౌడ్, నాయకులు పబ్బు రాజుగౌడ్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, ఉబ్బు వెంకటయ్య, వెల్గ రాజశేఖర్‌రెడ్డి, కంది లక్ష్మారెడ్డి, చిన్నం మల్లేష్, పోలోజు అనిల్‌చారి, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొంగిడి సునీతకు బీఫాం

యాదగిరిగుట్ట : ఆలేరు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫాం అందజేశారు. యాదాద్రీశుడి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజు బీఫా తీసుకోవడం సెంట్‌మెంట్‌గా భావిస్తున్నట్లు గొంగిడి సునీత తెలిపారు. ఎన్నికల్లో అధిక మెజార్టీతో విజయం సాధించాలని సీఎం కేసీఆర్ ఆశీర్వదించారని పేర్కొన్నారు. వరుసగా మూడవ సారి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫా అందుకోవడం సంతోషంగా ఉందని, అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.



ప్రగతి భవన్‌లో గొంగిడి సునీతకు బీఫాం అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయ ముఖమండపంలో 108 బంగారు, వెండి కలశాలల్లో శుద్ధ జలం, సుంగ్రంధ ద్రవ్యాలు పోసి పూజలు చేశారు. వీటితో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకించారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి.

శివాలయంలో..

యాదాద్రికి అనుబంధంగా కొండపై ఉన్న శివాలయంలో సంప్రదాయ పూజలు నిర్వహించారు.



స్వయంభూల అభిషేకానికి ప్రధాన కలశంలో శుద్ధ జలాన్ని తీసుకెళ్తున్న అర్చకులు

ఎన్నికల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, ఆలేరు రూరల్ : ఎన్నికల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రక్రియను ముగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట, ఆలేరు ఎంపీడీఓ కార్యాలయాల్లో బూత్ లెవల్, సెక్టోరియల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలుపై తెలుసుకున్నారు. దివ్యాంగులు, 80 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జోష్



భువనగిరిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్ మధుసూదనాచారి, నాయకులు భిక్షమయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు



వేదికపైన సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న కాసోజు శంకరమ్మ, సిద్దుల పద్మ



సభకు హాజరైన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి సతీమణి, కుమార్తె



ప్రజా ఆశీర్వాద సభకు తరలి వస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

'నోటా'కూ ఓట్లు

- బరిలో ఉన్న వారెవ్వరూ నచ్చకపోతే నోటా మీట నొక్కొచ్చు..
- 2014 ఎన్నికల నుంచి అమలు



కోదాడ : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ప్రతి ఒక్కరూ ఓటు వెయ్యాలి. మరి తమ నియోజక వర్గ పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవ్వరూ నచ్చకపోతే ఏం చేయాలి. ఎవరికో ఒకరి ఓటు వేయకుండా తమ నిరసనను వ్యక్తం చేయడం ఎలా..? దీనిపై 2003వ సంవత్సరంలోనే పలు స్వచ్ఛంద సంస్థలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. అనేక వాదోప వాదనలు జరిగిన తరువాత 'నోటా' (నన్ ఆఫ్ ద ఎబౌ)ను ఈవీఎంలలో చేర్చాలని సుప్రీం సూచించింది. 2014 ఎన్నికల నుంచి ఎన్నికల సంఘం ఈవీఎంలలో 'నోటా'ను చేర్చింది. బరిలో ఉన్న వారెవ్వరూ నచ్చకపోతే నోటా మీట నొక్కవచ్చు. అయితే జిల్లాలో జరిగిన రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ ఎన్నికలో నోటాకు 1 శాతానికి మించి ఓట్లు పడకపోవడం గమనార్హం.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే...

2014 నుంచి అమల్లోకి వచ్చిన నోటాకు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న 12 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లలో కేవలం 0.2 నుంచి 0.4 శాతమే. 2018 ఎన్నికల్లో 0.5 నుంచి 0.8 శాతం వరకు ఓట్లు వచ్చాయి. ఒక వేళ నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే దాని తర్వాత స్థానంలో నిలిచిన వారు గెలిచినట్లు ప్రకటించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెపుతున్నాయి.

ఇతర దేశాల్లో ఇలా..

ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే పలు దేశాలు నోటాను అమలు చేస్తున్నాయి.

- బెల్జియం, ఫ్రాన్స్, యూఎస్‌ఏలో ఈవీఎంల మీద నోటాను అమలు చేస్తున్నారు.
- కొలంబియా, స్పెయిన్, బ్రెజిల్, గ్రీస్, ఫిన్లాండ్, స్వీడన్, ఉక్రెయిన్, చిలీ వంటి దేశాలు ×ఓట్ ఆఫ్ రిజెక్ట్ । విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్ 2008 నుంచి నోటాను అమలు చేస్తుండగా పాకిస్తాన్ 2013 నుంచి నోటాను అమలు చేస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు ఓటు ఇలా..

నియోజకవర్గం	2014	శాతం	2018	శాతం
కోదాడ	621	0. 30	1240	0.64
సూర్యాపేట	722	0.31	820	0.45
నల్లగొండ	493	0.32	1276	0.69
మునుగోడు	558	0.30	3080	1.55
భువనగిరి	962	0.50	1347	0.78
నకిరేకల్	1395	0.60	1331	0.66
తుంగతుర్తి	852	0.40	1392	0.70
ఆలేరు	778	0.40	1464	0.76
మిర్యాలగూడ	957	0.50	1171	0.65
దేవరకొండ	1166	0.61	1695	0.91
సాగర్	775	0.41	1330	0.74
హుజూర్‌నగర్	852	0.39	1620	0.83
లోక్‌సభ ఎన్నికల్లో..				
నల్లగొండ	9305	0.60	5560	0.41
భువనగిరి	10,921	0.70	12,021	0.40

జంగ్ తెలంగాణ

మైండ్‌లో ఫిక్స్ అయితే..

ఒక్కో నాయకుడికి.. ఒక్కో ఆలయం సెంటిమెంట్

రాజకీయ నాయకులు రకరకాల సెంటిమెంట్లను పాటిస్తారు. ఎలాంటి మంచి కార్యక్రమం తలపెట్టినా గతంతో తమకు కలిసొచ్చిన పద్ధతులనే తిరిగి పాటిస్తారు. ఎన్నికల్లో పోటీ చేయడం, నామినేషన్లు వేయడం వంటి కార్యక్రమాలకు తమ మైండ్‌లో ఫిక్స్ అయిన సెంటిమెంట్‌కు ప్రాధాన్యం ఇస్తారు. అందులో భాగంగానేప్రస్తుత ఎన్నికల సందర్భంగా నేతల సెంటిమెంట్లపై ప్రత్యేక కథనం..



పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. 2014, 2018 ఎన్నికల్లో ఈ ఆలయానికి బీఫాం తీసుకొని వచ్చి పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. సోమవారం కూడా మంత్రితో కలిసి ఇక్కడ పూజలు చేశారు.

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి 1984, 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2018 ఇలా వరుస ఎన్నికల్లో అర్వపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు చేశాకే ప్రచారాన్ని ప్రారంభించేవారు.

యాదాద్రి సెంటిమెంట్‌గా..



పూజలు చేస్తున్న గొంగిడి సునీత దంపతులు (ఫైల్)

యాదగిరిగుట్ట : ఆలేరులో ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు యాదాద్రీశుడి ఆశీస్సులు పొందాకనే ప్రచారాన్ని ప్రారంభిస్తారు. సొంత గ్రామమైన రాజాపేట మండలం పారుపల్లి నుంచి ప్రచారం చేపట్టేవారు.

- బూడిద బిక్షమయ్యగౌడ్ 2014, 2018లో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశాక, బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలోని వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని.. గుండాల మండలం బండకొత్తపల్లి నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు.
- గొంగిడి సునితామహేందర్‌రెడ్డి 2014లో తన సొంత గ్రామమైన యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులను తీసుకుంటారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని నామినేషన్ దాఖలు చేయడం ఆనవాయితీ.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేశాకే..

నల్లగొండ : కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండలోని వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర దేవాలయంలో బీఫాం ఉంచి పూజలు చేయడం సెంటిమెంట్. గత ఐదు సార్లు ఈ ఆలయంలోనే పూజలు చేశారు. ఈ ఎన్నికల్లో కూడా ఈ ఆలయంలోనే పూజలు చేసి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి పానగల్‌లోని వెంకటేశ్వర దేవాలయంలో బీఫాం ఉంచి పూజలు చేశాక.. ప్రచారం నిర్వహిస్తారు. ఈ సారికూడా ఆదివారం సీఎం కేసీఆర్ నుంచి బీఫాం తీసుకొని సోమవారం ఉదయం పార్టీ నాయకులు, కార్యకర్తలతో వెళ్లి పానగల్ దేవాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు.

వారి ఇష్టదైవం లింగబస్వేశ్వరుడు..



లింగ బస్వేశ్వర స్వామి ఆలయం

భువనగిరి : ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి 2014, 2018 నామినేషన్ వేసే ముందు బీబీనగర్ మండలంలోని పడమటి సోమారం గ్రామంలో ఉన్న శ్రీ లింగబస్వేశ్వర స్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం పైళ్ల ప్రచార వాహనానికి లింగ బస్వేశ్వర ఆలయం వద్ద ఆయన సతీమణి రజిత పూజలు చేశారు.

- భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా మూడుసార్లు మంత్రి పదవి చేపట్టిన ఎలిమినేటి మాధవరెడ్డితో పాటు ఆయన మరణానంతరం సతీమణి ఉమా మాధవరెడ్డి కూడా లింగబసేశ్వర స్వామి దేవాలయంలోనే నామినేషన్‌వేసే ముందు పూజలు నిర్వహించే వారు.
- 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి అభ్యర్థిగా పోటీ చేసిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూడా నామినేషన్ వేసే ముందు లింగబస్వేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు చేసి..

సూర్యాపేట : మంత్రి జగదీష్‌రెడ్డి నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో గల శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో 2014, 2018 ఎన్నికల్లో బీఫాం అందుకుని పూజలు చేసిన తర్వాత ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారు. అలాగే.. అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కూడా పూజల చేయడం ఆనవాయితీ.

ఆంథోల్ మైసమ్మ ఆశీర్వాదం తీసుకుని..



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్ : ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి 2014, 2018 సాధారణ ఎన్నికలు, 2022 ఉప ఎన్నికల సమయంలో చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామంలోని శ్రీఆంథోల్ మైసమ్మ దేవాలయంలో పూజలు చేశాకే నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన తర్వాత తొలిసారి ఇక్కడే ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు.

- 2018 ఎన్నికల్లో నామినేషన్ కార్యక్రమానికి వెళ్లే రోజు ఆంథోల్ మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఉప ఎన్నికలోనూ ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించారు.
- మునుగోడు నియోజకవర్గం నుంచి సుదీర్ఘ అనుబంధం కలిగిన దివంగత మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మాత్రం ప్రత్యేకంగా వ్యవహరించేవారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతిసారి నామినేషన్‌కు ముందురోజు యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నిద్ర చేసేవారు. మరుసటి రోజున బీఫాం, నామినేషన్ దాఖలు చేసే పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత నామినేషన్ దాఖలు చేసేవారు.

ఈశాన్యం నుంచి ప్రచారం..

కోదాడ : నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులంతా తమ ప్రచారాన్ని ఈశాన్యం మూల నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా అనంతగిరి మండలంలోని గోండ్రియాల శివాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి, బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ ఇద్దరూ ఇక్కడి నుంచి ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలం బుగ్గమాదారంలో గల శ్రీ పంచ పట్టాభిరామ స్వామి ఆలయంలో పూజలు చేశాకే ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఇటీవల ఈ ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను ఆహ్వానించారు.

నకిరేకల్ : నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య 2009, 2014, 2018లో ఎన్నికల్లో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ.

- వేముల వీరేశం 2014, 2018 ఎన్నికల్లో నకిరేకల్ దుర్గమ్మ సన్నిదిలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు.

ఆంజనేయుడి ఆశీస్సులతో..

హాలియా : సాగర్ అసెంబ్లీ ఎన్నికల్లో కుందూరు జానారెడ్డి నామినేషన్ వేసే ముందు నాగార్జునసాగర్‌లోని సత్యనారాయణస్వామి, అల్వాల ఎక్స్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించుకొని ఇష్టదైవాల ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేసి వరుస విజయాలు సాధించారు. జానారెడ్డికి లక్కీ నంబర్ 9. 2014 ఎన్నికల్లో జానారెడ్డి 9వ తేదీన నామినేషన్ వేసి గెలుపొందారు. ప్రస్తుతం ఆయన కార్లకు కూడా 9999 నంబర్లు ఉంటాయి.

- నాగార్జునసాగర్‌లో నోముల కుటుంబం తుమ్మడం గ్రామంలో ఉన్న శివాలయంలో పూజలు చేశాకే ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. 2018 ఎన్నికల్లో నోముల నర్సింహయ్య ఈ ఆలయంలోనే పూజలు చేసి.. నామినేషన్ దాఖలు చేశారు. 2021లో ఉప ఎన్నికల్లో నర్సింహయ్య తనయుడు నోముల భగత్ ఈ ఆలయంలోనే పూజలు చేసి నామినేషన్ వేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న జానారెడ్డి (ఫైల్)

సీఎం సభకు భారీ బందోబస్తు

భువనగిరి క్రైం: భువనగిరిలో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, అడిషనల్ సీపీ అభిషేక్ మహంతి, డీసీపీలు గిరిధర్, రాజేష్ చంద్ర, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శివరాంరెడ్డి పర్యవేక్షణలో 15మంది సీఐలు, ఎస్‌ఐలు, సివిల్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, మహిళా పోలీసు సిబ్బంది 450 మంది బందోబస్తులో పాల్గొన్నారు. సభ ప్రాంగణంతో పాటు రాయగిరి, పాత బస్టాండ్, హైదరాబాద్ చౌరస్తా, బొమ్మయపల్లి క్రాస్‌రోడ్, చెరువు కట్ట, ఎల్లమ్మ గుడి చౌరస్తా, నల్లగొండ చౌరస్తా వద్ద పెట్రోలింగ్ వాహనాల ద్వారా బందోబస్తును పర్యవేక్షించారు.



సభ వద్ద భద్రతను పరిశీలిస్తున్న సీపీ, డీసీపీ

నాయకుల ముందస్తు అరెస్టు

సీఎం సభ నేపథ్యంలో బీఎస్ తిమ్మాపురం భూనిర్వాసితులు, రీజినల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోయిన రైతులతో పాటు భువనగిరి బంద్‌కు పిలుపునిచ్చిన శివసేన జిల్లా అధ్యక్షుడు పూస శ్రీనివాస్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల తనిఖీల్లో రూ.20.59 లక్షలు పట్టివేత

చౌటుప్పల్: మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు సరైన ఆధారాలు చూపని కారణంగా రూ.9.20లక్షలు సీజ్ చేసినట్లు చౌటుప్పల్ సీఐ దేవేందర్ తెలిపారు.

మర్రిగూడలో రూ.9లక్షలు..

మర్రిగూడ: మండలంలోని లెంకలపల్లికి చెందిన బెజ్జాల శ్రీశైలం బైక్‌పై రూ.9లక్షలు తీసుకెళ్తుండగా.. సరంపేట ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

ఆత్మకూరులో రూ.2,39,000..

ఆత్మకూరు (ఎం): మండలంలోని కాప్రాయపల్లి చెక్‌పోస్టు వద్ద పల్లెర్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ షోరూం మేనేజర్ వస్తుపాల స్వామి నుంచి రూ.2,39,000 నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



- మిర్యాలగూడ పట్టణం వెంకటాద్రి పాలెంలో గల పెట్రోల్‌బంకు నందు పని చేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. సంప్ర।। 9493292002 [Y-798279]
- నల్గొండ జిల్లాలోని నూతనంగా ప్రారంభించిన మా కంపెనీలో స్త్రీ/పులకు ఉద్యోగాలు. జీ:14వేలు+6వేలుDA+ఫ్రీరూం. Qly: 7th-ఇంటర్, ITI, డిప్లొమా (P/F), నో ఫీజు. 99632 80512 [L-781038]
- సెక్యూరిటీ సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ మేళ్ళచెరువులో కావలెను. 8 గం।। డ్యూటీ, మంచి జీతం, తక్కువ రేటుకు భోజనం ✆ 63008 79854, 86884 17132 [B-295]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]
- రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను. భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]



- నల్లగొండ ప్రకాశం బజార్‌లో బాయ్స్ & మెన్స్‌వేర్ అతి తక్కువ ధరలో అమ్మబడును. గ్లాస్ ఫర్నీచర్, గ్లాస్ కౌంటర్స్, 2 A/c లు, సి.సి. కెమెరా, పార్టీషన్, ఇన్వర్టర్ కలవు. నల్లగొండ. సంప్ర।। 9247272429 [Y-798280]

BUSINESS OFFER

- కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్, ప్రాపర్టీ, పర్సనల్, అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary + Commission. ఫోన్ : 9990752820 [HA-31102]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు తెలంగాణలో చోటు లేదు

- కేంద్ర ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

సూర్యాపేట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చోటు లేదని కేంద్ర ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, కేంద్రం నిధులతో చేసిన పనులను తమ ఖాతాల్లో వేసుకొని ప్రచారం చేసుకుంటోందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో అరాచకాలే మిగిలాయన్నారు. 1997లోనే తెలంగాణ ఇవ్వాలని బీజేపీ తీర్మానం చేసిందని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేస్తే తండ్రీకొడుకులు కమీషన్లకు కక్కుర్తిపడి వాటిని రానివ్వడం లేదని పరోక్షంగా కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో నాయకులు మధుకర్, సంకినేని వెంకటేశ్వరావు, బొబ్బ భాగ్యారెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి కోసం వేధింపులు

- అత్తపై దాడి చేసి.. తిరిగి ఆమె పైనే కేసు పెట్టిన కోడలు
- మిర్యాలగూడ పట్టణంలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: ఆస్తి కోసం అత్తపై కోడలు దాడి చేయడమే కాకుండా తనను వేధిస్తున్నారంటూ తిరిగి కోడలే అత్తపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. టూటౌన్ సీఐ నరసింహారావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న వహీద్, సుల్తానా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు షఫీవుల్లా, ఫసీవుల్లా ఉన్నారు. ఇద్దరు కుమారులను పెంచి పెళ్లిళ్లు చేసి చెరో రూ.80లక్షల విలువ చేసే ఆస్తులను పంచి ఇచ్చారు. ప్రస్తుతం ఆ వృద్ధ దంపతులు తాము జీవితాంతం కష్టపడి కట్టుకున్న సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. కాగా ఆ ఇంటిని కూడా విక్రయించి తమకు సమంగా పంచి ఇవ్వాలని వహీద్, సుల్తానా బేగం దంపతులపై గత కొద్ది నెలలుగా చిన్న కుమారుడు షఫీవుల్లా, అతడి భార్య బుష్రా ఒత్తిడి చేస్తున్నారు. కాగా తాము బతికి ఉండగానే ఇల్లు అమ్మితే ఎక్కడ ఉండాలని ఆ వృద్ధ దంపతులు ఇల్లు అమ్మడానికి ఒప్పుకోలేదు. దీంతో వారిపై కక్ష పెంచుకున్న చిన్న కోడలు బుష్రా సోమవారం తన భర్త షఫీవుల్లాతో కలిసి అత్తమామలు ఉంటున్న ఇంటికి వెళ్లి అత్త సుల్తానా బేగంను తీవ్ర పదజాలంతో దూషించి ఆమెపై దాడి చేసింది. దీంతో సుల్తానా బేగం పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. కోడలు బుష్రా చిన్న కత్తి తీసుకొని తన చేతిపై గాయపర్చుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనను అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని తిరిగి వారి పైనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ వృద్ధ దంపతులు కూడా తమ గోడును పోలీసులకు వివరించి కోడలిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహారావు పేర్కొన్నారు.

బుద్ధవనం చేరిన ధమ్మయాత్ర



మహాస్థూపం వద్ద అశోక ధమ్మయాత్ర బృందం

నాగార్జునసాగర్ : కేరళలోని శబరిమలైలో ఈ నెల 1న ప్రారంభమైన అశోక ధమ్మయాత్ర-2023 సోమవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి చేరుకుంది. యాత్ర బృందానికి బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జి డీఆర్. శ్యాంసుందర్‌రావు స్వాగతం పలికారు. అనంతరం బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ శివనాగిరెడ్డి బుద్ధవనం చరిత్ర, ప్రత్యేకతలను వారికి వివరించారు. అనంతరం యాత్ర బృందం బుద్ధపాద వందనం, స్థూపపార్కు సందర్శించారు. అనంతరం మహాస్థూపంలోని సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. సమావేశంలో జాతీయ ధమ్మయాత్ర కమిటీ బుద్ధిస్ట్ ఫ్రెండ్లీ కౌన్సిల్, బౌద్ధమహాసభ తెలంగాణ శాఖ ప్రతినిధులు పూజ్యభంతే, సారిపుత్ర, పరందాములు, డాక్టర్ సత్తయ్య, తోకల సంజీవ్ పాల్గొన్నారు.

మూడోసారి కూడా కేసీఆరే ముఖ్యమంత్రి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసిన కేసీఆరే మూడోసారి కూడా ముఖ్యమంత్రి అవుతారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకరించినా, సహకరించకపోయినా రైతాంగానికి, వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రైతుబీమా మాదిరిగానే రాష్ట్రంలోని బీపీఎల్ కుటుంబాలకు రూ.5 లక్షల బీమా పథకం అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టడం శుభపరిణామన్నారు. రైతు బంధును వచ్చే మార్చి తర్వాత ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, ఆ తర్వాత దశల వారీగా రూ.16వేలు చేస్తామననారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆసరా పింఛన్లు పెంచడం, రూ.400 లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం వంటి మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయడం ఒక్క కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమన్నారు. వ్యవసాయం, సంక్షేమంలో దేశంలోనే ఏ రాష్ట్రం కూడా తెలంగాణతో పోటీ పడలేవన్నారు. ఈబీసీలకు గురుకులాలు ఏర్పాటు చేయడం, అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించడానికి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు ఉండొద్దని కోరే పార్టీ బీజేపీ అని, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డివి మాట్లాడేవన్నీ గాలి మాటలనేనని విమర్శించారు.

నీటిని విడుదల చేయాలని రోడ్డెక్కిన రైతులు

కోదాడరూరల్: ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని గణపవరం ఎల్-5 మేజర్‌కు నీటిని విడుదల చేయాలని రామలక్ష్మీపురం, బీక్యాతండా, ఎర్రవరం, గణపవరం, తొగర్రాయి గ్రామాల రైతులు సోమవారం కోదాడ-మేళ్లచెర్వు రహదారిపై ధర్నాకు దిగారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. గణపవరం ఎల్-5 మేజర్ కాల్వ పరిధిలో వందల ఎకరాల భూములకు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ నుంచి నీటిని తమ తూములకు విడుదల చేయకుండా కిందకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు 14వందల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గంటకు పైగా ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఎన్‌ఎస్పీ అధికారులతో మాట్లాడి సాయంత్రం వరకు నీటిని విడుదల చేయిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో గణపవరం ఎంపీటీసీ సింగారెడ్డి హిమబిందు సుమన్‌రెడ్డి, నారపురెడ్డి, మధు, అమరగాని లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

చెరువులో ఈతకు వెళ్లి యువకుడు మృతి

బీబీనగర్: చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నారపల్లికి చెందిన వారణాసి తరుణ్(24) తన స్నేహితుడు డీకొండ నితిన్‌తో కలిసి ఆదివారం బీబీనగర్‌లో ఉంటున్న మరో స్నేహితుడిని కలిసేందుకు వచ్చారు. స్నేహితుడిని కలిసిన తర్వాత తరుణ్, నితిన్ కలిసి బీబీనగర్ మండలంలోని వరంగల్-హైదరాబాద్ హైవే పక్కన పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. తరుణ్, నితిన్ చెరువులో ఈత కొట్టేందుకు దిగారు. తరుణ్ చెరువులోరాళ్ల మధ్యన ఇరుక్కుపోయాడు. నితిన్ బయటకు వచ్చి స్థానికులకు విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువు వద్దకు చేరుకొని తరుణ్ కోసం గాలింపు చర్యలు ఆచూకీ లభించలేదు. సోమవారం చెరువులో తరుణ్ మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తరుణ్ ముఖంపై గాయాలు ఉండడంతో నితిన్‌పై అనుమానం ఉన్నట్లు మృతుడి తండ్రి గోవిందాచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.